సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం ı 24 ı ఫిబ్రవరి ı 2025

గరిష్టం / కనిష్టం
36°/21°

వాతావరణం
జిల్లాలో సోమవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యాకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. నిత్యకల్యాణంలో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేషపూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు విశేష పూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి


సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేయాలని కలెక్టర్ సూచించారు.

వన్యప్రాణుల దాహార్తి తీరేలా..

- తాగునీటి సమస్య లేకుండా అటవీశాఖ చర్యలు
- అటవీప్రాంతంలో చెక్ డ్యామ్‌లు, నీటి కుంటలు ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో 8,409 వన్యప్రాణులు

జంతువుల కోసం ఏర్పాటు చేసిన కుంటలో నీరు పడుతున్న సిబ్బంది(ఫైల్)





చుంచుపల్లి: వేసవిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి వేసవిలో ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఎండల తీవ్రతకు అటవీ ప్రాంతాల్లో కుంటలు, చెలిమలు, వాగులు ఎండిపోయి నీటి ఎద్దడి నెలకొంటుంది. దాహార్తి తీర్చుకునేందుకు జింకలు, దుప్పులు, కనుజులు, ఎలుగుబంట్లు, కొండగొర్రెలు తదితర వన్యప్రాణులు సమీప గ్రామాలకు, మైదాన ప్రాంతాలకు వెళ్లి మృత్యువాత పడుతున్నాయి. దీంతో అటవీ జంతువుల దాహం తీర్చేందుకు ఐదేళ్లుగా ఫారెస్ట్ శాఖ అధికారులు సాసర్ పిట్లు, చెక్ డ్యామ్‌లు, నీటి కుంటలు నిర్మిస్తున్నారు. వీటిలో ట్యాంకర్లతో మూడు రోజులకోసారి నీటిని నింపనున్నారు. ఇందుకోసం కంపా, బయోసాట్ పథకాల నిధులు కేటాయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో దట్టమైన అడవులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లి, భద్రాచలం, కిన్నెరసాని, కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు 8 అటవీ డివిజన్లు విస్తరించి ఉన్నాయి. వీటి పరిధిలో 680.02 చదరపు కిలోమీటర్లు దట్టమైన అడవులు ఉండగా, 1764.15 చదరపు కిలోమీటర్ల మేర మధ్య స్థాయి అడవులు, ఇక ఓపెన్ అడవులు 1024.96 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 591 చెక్ డ్యామ్‌లు, 861 సాసర్ పిట్లు, 402 పెద్ద నీటి కుంటలు, 379 చిన్న నీటి కుంటలు, 100 వరకు సోలార్ పంపుసెట్ల ద్వారా వన్యప్రాణులకు తాగునీరు అందించేందుకు అటవీ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. బేస్ క్యాంపులు ఏర్పాటు చేసి అటవీ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేలా ప్రణాళికలను రూపొందించారు. నీటి వనరులు ఉన్న ప్రాంతాలను పసిగట్టి కొందరు వేటగాళ్లు మాటు వేస్తుండటంతో అటవీ అధికారులు ట్రాపింగ్ కెమెరాల ద్వారా నిఘా పెడుతున్నారు.

వన్యప్రాణులను కాపాడేందుకు చర్యలు



వేసవి కాలంలో సహజంగా నీటి వనరులు ఎండిపోయి దాహంతో వన్యప్రాణులు అల్లాడిపోతాయి. అటవీ జంతువులకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. జంతువులు అధికంగా సంచరించే ప్రాంతాల్లో సాసర్‌పిట్లు, నీటి కుంటలు ఏర్పాటు చేసి నిత్యం నీరు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. – కిష్టాగౌడ్, డీఎఫ్‌ఓ

నిరంతరం పర్యవేక్షిస్తాం



వేసవికాలంలో అటవీ జంతువుల దాహార్తి తీర్చేందుకు నీటి కొరత లేకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటాం. నీటి కుంటలు, సాసర్‌పిట్లు, చెక్ డ్యామ్‌ల ద్వారా వన్యప్రాణులకు నీటి సమృద్ధిగా అందిస్తాం. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడంతోపాటు సిబ్బందితో కలిసి నిరంతరం పర్యవేక్షిస్తాం.
– బి.రామకృష్ణ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, రామవరం

కరాటేతో ఆత్మరక్షణ, మనోధైర్యం

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంటౌన్: కరాటే నేర్చుకుంటే ఆత్మరక్షణతోపాటు మనోధైర్యం కూడా పెంపొందించుకోవచ్చని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. కొత్తగూడెంలోని ఎంపవర్‌మెంట్ హాల్‌లో ఆదివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరాటే మానసిక, శారీరక దృఢత్వానికి దోహదపడుతుందని అన్నారు. రెండు రాష్ట్రాల నుంచి దాదాపు 350 మంది హాజరై ప్రతిభ చాటారు. సబ్ జూనియర్ బాయ్స్ బ్లాక్ బెల్ట్ గ్రాండ్ చాంపియన్‌గా శివాజీ నిలిచాడు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌ఓ పి.పరంధామరెడ్డి, మాజీ కౌన్సిలర్ చల్లా శకుంతల, బత్తుల సురేష్, నేరేళ్ల రమేష్, చల్లా భాస్కర్, ఇందిరాల దుర్గయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కరాటే పోటీలను వీక్షిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి

నేటి నుంచి టెన్నిస్ మ్యాచ్‌లు

ఖమ్మంస్పోర్ట్స్: ఆల్ ఇండియా ర్యాంకింగ్ పురుషుల టెన్నిస్ పోటీలు సోమవారం నుంచి ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రారంభం కానున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి ఇప్పటికే ర్యాంకింగ్‌లో నిలిచిన 32 మంది హాజరు కాగా క్వాలిఫయింగ్ పోటీల్లో మరో 13 మంది క్వాలిఫై కావడంతో వారికి నాకౌట్ మ్యాచ్‌లను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, రూ.2.50 లక్షలకు పైగా నగదు బహుమతులు అందించనున్నామని నిర్వాహకులు తెలిపారు. మూడు టెన్నిస్ కోర్టులు సిద్ధం చేశామని వివరించారు.

అటు ఏపీ.. ఇటు తెలంగాణ

మోతెగడ్డకు పడవలపై చేరుకుంటున్న భక్తులు(ఫైల్), (ఇన్‌సెట్) వీరభద్రస్వామివారు





గోదావరి నడుమ కాకతీయుల నాటి ఆలయం

- గుట్టపై శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి క్షేత్రం
- ఈ నెల 26న కల్యాణానికి ముమ్మరంగా ఏర్పాట్లు
- ఆధ్యాత్మికతతోపాటు ఆహ్లాదం కలిగించే పడవ ప్రయాణం

బూర్గంపాడు: పవిత్ర గోదావరి నది మధ్యలో ప్రకృతి అందాల నడుమ మోతెగడ్డ వీరభద్రస్వామి ఆలయం అటు ఆధ్యాత్మికతను ఇటు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఇరువైపులా ఇసుక తిన్నెలు... గలగలా పారుతున్న గోదావరి జలాల మధ్యలో ఎత్తైన గుట్టపై కొలువైన వీరభద్రస్వామి ఆలయం రమణీయతను సంతరించుకుంది. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా స్వామివారిని ఈ ప్రాంత ప్రజలు విశ్వసిస్తారు. ఏజెన్సీలోని గిరిజనులు ఆరాధ్య దైవంగా కొలుస్తారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి కూడా శివరాత్రి రోజున స్వామివారి కల్యాణం వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు. 600 ఏళ్ల క్రితం కాకతీయులు నిర్మించిన ఆలయంలో ఈ నెల 26న భద్రకాళి సమేత వీరభద్రుని కల్యాణానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కాగా గోదావరి ఇవతలి ఒడ్డున బూర్గంపాడు మండలంలోని మోతె గ్రామం ఉండగా, అవతలి ఒడ్డున ఏపీలోని ఎటపాక మండలం చింతలగూడెం ఉంటుంది.

శ్రీసూర్యభగవానుడే క్షేత్రపాలకుడు..

కాకతీయుల కాలం నాటి ఈ పురాతన శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయానికి శ్రీసూర్యభగవానుడు క్షేత్ర పాలకుడిగా ఉండటం విశేషం. సంతానం లేనివారు పవిత్ర గోదావరి నదిలో మూడు సార్లు స్నానం చేసి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రాణాసారం పట్టడం వల్ల సంతానం కలుగుతుందని పలువురు విశ్వసిస్తారు. శివరాత్రి పర్వదినం రోజు స్వామివారి కల్యాణానికి అవసరమైన తలంబ్రాల బియ్యాన్ని భక్తులు స్వయంగా వడ్లు వలిచి తయారుచేస్తారు. కల్యాణం ముందు రోజు స్వామివారు చింతలగూడెం నుంచి వీరభద్రుని గుట్టకు చేరుకుంటారు. శివరాత్రి రోజు తెల్లవారుజామున స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, సర్వదర్శనం, విశేష అర్చనలు జరిపి, లింగోద్భవ కాలమునందు భద్రకాళి సమేత శ్రీవీరభద్ర స్వామివారి కల్యాణం ఘనంగా జరిపిస్తారు. మరుసటిరోజు అత్యంత పవిత్రమైన శ్రీరుద్ర గాయత్రి మహాయజ్ఞం వైభవోపేతంగా నిర్వహిస్తారు.


ఇలా వెళ్లాలి..

బూర్గంపాడు మండలంలోని సారపాక నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మోతె గ్రామం వెళ్లాలి. భద్రాచలం వెళ్లే ప్రతీ బస్సు సారపాక మీదుగా వెళ్తున్నందున భక్తులకు ప్రయాణం సులువుగా ఉంటుంది. సారపాక నుంచి మోతెకు శివరాత్రి రోజు ఆటోలు అందుబాటులో ఉంటాయి. భక్తులు గోదావరి ఒడ్డుకు చేరుకుని ఇసుకలో కొద్దిదూరం కాలినడకన వెళ్లాలి. అక్కడి నుంచి పడవలపై గుడికి చేరుకోవాలి. పడవలపై ప్రయాణం భక్తులకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. గుట్టపై ఉన్న పురాతన ఆలయాన్ని దర్శించుకుంటే ఆధ్యాత్మికభావన కలుగుతుంది. భద్రాచలం వైపు నుంచి వస్తే బస్టాండ్‌కు సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో చింతలగూడెం(ఏపీ) చేరుకుని, ఇసుకలో నడుచుకుంటూ స్వామివారి గుట్టకు చేరుకోవచ్చు.

కల్యాణానికి ముమ్మర ఏర్పాట్లు



వీరభద్రస్వామి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పిస్తున్నాం. భక్తులకు తాగునీరు, స్నాన వాటికలు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు అందుబాటులోకి తెస్తున్నాం. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సహకారంతో భక్తులకు అన్నివసతులు కల్పిస్తున్నాం. గోదావరిలో గజ ఈతగాళ్లు, ఫైర్ అధికారులను నియమిస్తాం.
–సుదర్శన్, ఆలయ కార్యనిర్వహణాధికారి



గోదావరి మధ్యలో గుట్టపై కొలువైన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం

క్రీడలతో స్నేహసంబంధాలు బలోపేతం

మణుగూరు భారజల కర్మాగారం జీఎం హెచ్‌కే శర్మ

అశ్వాపురం: క్రీడాపోటీలతో ఉద్యోగుల మధ్య స్నేహ సంబంధాలు బలోపేతమవుతాయని మణుగూరు భారజల కర్మాగారం జీఎం హెచ్‌కే.శర్మ అన్నారు. మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో ఉన్న హోమిబాబా టర్ఫ్ వికెట్ క్రికెట్ మైదానంలో జిల్లా ఇండస్ట్రియల్ 12వ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని సింగరేణి, కేటీపీఎస్, నవభారత్, ఐటీసీ పీఎస్‌పీడీ, అశ్వాపురం భారజల కర్మాగారం పరిశ్రమలకు చెందిన ఎనిమిది జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. కేటీపీఎస్, నవభారత్ జట్ల మధ్య తొలి మ్యాచ్‌ను జీఎం ప్రారంభించి మాట్లాడారు. అందరూ క్రీడా స్ఫూర్తి చాటాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శ్రీనివాసరావు, అధికారులు, వివిధ పరిశ్రమల ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం హెచ్‌కే శర్మ

నేత్రపర్వం.. శత సహస్రం

- వైభవంగా హనుమాన్ చాలీసా పారాయణం
- ఏకరూప దుస్తులతో హాజరైన 3 వేల మంది భక్తులు
- వేడుకకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు

ఖమ్మంగాంధీచౌక్ : ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన శత సహస్ర హనుమాన్ చాలీసా పారాయణం నేత్రపర్వంగా సాగింది. శ్రీ స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు వివిధ ప్రాంతాలకు చెందిన మూడు వేల మందికి పైగా భక్తులు ఏకరూప దుస్తులు ధరించి హాజరయ్యారు. వేదికపై హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేసి, ఉదయం 7:30 గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ గణపతి పూజ, గోపూజ చేశారు. ఆ తర్వాత భక్తులు లక్ష హనుమాన్ చాలీసా (108 సార్లు) పారాయణం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 80 భజన మండళ్లు పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాయి. హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీ స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి వలంటీర్లు పలు రకాల సేవలందించారు. పారాయణంలో పాల్గొన్న మూడు వేల మందితో పాటు ఇతరులకు కలిపి మొత్తంగా నాలుగు వేల మందికి అన్నదానం చేశారు.



పూజలు చేస్తున్న నిర్వాహకులు

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు..

ఖమ్మంలో నిర్వహించిన శత సహస్ర హనుమాన్ చాలీసా పారాయణానికి 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్' అవార్డులు దక్కాయి. ఈ వేడుకను పరిశీలించాల్సిందిగా శ్రీ స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి దరఖాస్తు చేయగా అవార్డు సంస్థలు హాజరయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందేలా కార్యక్రమం నిర్వహించారంటూ అభినందించిన సంస్థల ప్రతినిధులు ఈ రెండు అవార్డులకు ఎంపిక చేశాయి. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కో–ఆర్డినేటర్ బింగి నరేంద్ర గౌడ్ శ్రీ స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి అధ్యక్షులు వేములపల్లి వెంకటేశ్వరరావుకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు గన్నవరపు నాగేశ్వరరావు, లగడపాటి రామారావు, ప్రతాపని నర్సింహారావు, కటకం చిన్న హనుమంతరావు, మోతుకూరి మురళీధర్, పుల్లఖండం సురేష్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, గుండాల కృష్ణ పాల్గొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు



సమాచారం కోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

డిపో	డిపో మేనేజర్	కంట్రోలర్
ఖమ్మం కొత్త బస్టాండ్	99592 25958	99592 25979
ఖమ్మం పాత బస్టాండ్		99592 25965
సత్తుపల్లి	99592 25962	99592 25990
మణుగూరు	99592 25963	89853 61796
కొత్తగూడెం	99592 25959	99592 25982
మధిర	99592 25961	73829 25289
భద్రాచలం	99592 25960	99592 25987

- ఈ నెల 25, 26, 27 తేదీల్లో తిప్పనున్న సర్వీసులు
- రీజియన్ పరిధిలో 75 బస్సులు

ఖమ్మంమయూరిసెంటర్: మహాశివరాత్రి పర్వదినాన్ని ఈనెల 25, 26, 27 తేదీల్లో పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలకు సమీప డిపోల నుంచి ఈ సర్వీసులు నడిపేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి జిల్లాలోని తీర్థాల, స్నానాల లక్ష్మీపురం, నీలాద్రి, అన్నపురెడ్డి పల్లి, మోతెగడ్డ, బెండాలపాడు శైవ క్షేత్రాలకు ఖమ్మం రీజియన్‌లోని పలు డిపోల నుంచి 75 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. అదనపు చార్జీలతో నడిపే ఈ సర్వీసుల్లో మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని సైతం వర్తింపజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

డిపోల వారీగా నడిపే బస్సుల సంఖ్య, చార్జీల వివరాలు..

పుణ్యక్షేత్రం	డిపో	బస్సుల సంఖ్య	చార్జీల వివరాలు (రూ.ల్లో) ఫుల్ టికెట్	హాఫ్ టికెట్
తీర్థాల	ఖమ్మం	25	30	20
నీలాద్రి	సత్తుపల్లి	25	50	30
స్నానాలలక్ష్మీపురం	మధిర	10	30	20
మోతెగడ్డ	భద్రాచలం	05	30	20

- కొత్తగూడెం డిపో నుంచి నీలాద్రి, అన్నపురెడ్డిపల్లి, బెండాలపాడు ప్రాంతాలకు 10 బస్సులు నడపనున్నారు. నీలాద్రి, అన్నపురెడ్డిపల్లికి పెద్దలకు రూ.90, పిల్లలకు రూ.50 చార్జీ ఉండగా.. బెండాలపాడుకు పెద్దలకు రూ.30, చిన్నారులకు రూ.20 చార్జీ వసూలు చేయనున్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలి

సింగరేణి డైరెక్టర్ సూర్యనారాయణ

సింగరేణి(కొత్తగూడెం)/మణుగూరు టౌన్: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలని, 72 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి లక్ష్యం సాధించాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) సూర్యనారాయణ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా చేస్తున్న ఈయన ఇటీవల డైరెక్టర్(ఆపరేషన్స్)గా ఉద్యోగోన్నతి పొందిన విషయం విదితమే. ఆదివారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం మణుగూరు ఏరియాలో పర్యటించారు. మణుగూరు ఓసీ, ఓసీ–4 గనులను సందర్శించారు. నూతనంగా అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయనకు తొలుత ఏరియా జీఎం దుర్గం రాంచందర్, పలు విభాగాల అధిపతులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్యాంసుందర్, శ్రీనివాస్, వీరభద్రరావు, శ్రీనివాసచారి, రాంబాబు, నర్సింహారావు, రమణారెడ్డి, కల్యాణ్‌రాం, వెంకటరావు, బైరెడ్డి వెంకటేశ్వర్లు, నవీన్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మణుగూరు ఓసీలో బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న డైరెక్టర్ సూర్యనారాయణ

క్లుప్తంగా

ఆయిల్‌ఫెడ్ ఇన్‌చార్జ్ డీఎంగా రాధాకృష్ణ


నాయుడు రాధాకృష్ణ

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట ఆయిల్ ఫెడ్ ఇన్‌చార్జ్ డివిజినల్ మేనేజర్‌గా నాయుడు రాధాకృష్ణను నియమించారు. సత్తుపల్లి మండలం రేగళ్లపాడు ఆయిల్ ఫెడ్ నర్సరీలో జరిగిన అవకతవకలు, ఆఫ్‌టైప్ మొక్కలను అనుమతి లేకుండా ధ్వంసం చేశారనే ఆరోపణలతో స్థానిక ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణపై సస్పెన్షన్ వేటు పడిన విషయం విదితమే. ఈ నెల 22న బాలకృష్ణను సస్పెండ్ చేయగా నారంవారిగూడెం ఆయిల్‌ఫెడ్ డివిజనల్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఫైనాన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న రాధాకృష్ణను నియమించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశపరీక్ష


కిన్నెరసానిలో ప్రవేశపరీక్ష రాస్తున్న విద్యార్థులు

పాల్వంచరూరల్: సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి, 6,7,8,9 తరగతుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 18 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 5,090 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4,942 మంది హాజరయ్యారు. 148 మంది గైర్హాజరయ్యారని, 97 శాతం హాజరు నమోదైందని రూట్ ఆఫీసర్ ఉపేందర్ తెలిపారు. పరీక్షలను డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు పర్యవేక్షించారు.

కిన్నెరసానిలో జలవిహారం


కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు


పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ఆదివారం సందడి నెలకొంది. మండల పరిధిలోని కిన్నెరసాని ప్రాజెక్ట్‌కు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్ సమీపం నుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించారు. 509 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.17,105 ఆదాయం లభించింది. 300 మంది బోటు షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.18,350 ఆదాయం సమకూరినట్లు నిర్వాహకులు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్


నిందితులు, గంజాయిని చూపుతున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం మీదుగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆర్టీఏ కార్యాలయం వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న ముగ్గురు యువకులను ఆపి తనిఖీ చేయగా రూ.21 లక్షల విలువైన 19.56 కేజీల గంజాయి లభించిందని, నిందితులు మిర్యాలగూడ, చిలకలూరిపేటకు చెందిన తరుణ్, షేక్ రియాజ్, కొడావత్ బాలస్వామిగా తేలిందని వెల్లడించారు. వీరు ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారని శ్రీనివాస్ పేర్కొన్నారు.

మధిర రైల్వేస్టేషన్‌లో...


గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మధిర: మధిర రైల్వేస్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం తనిఖీ చేయగా 8 కేజీల గంజాయి దొరికిందని మధిర ఎక్సైజ్ సీఐ రామ్మూర్తి తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి నాగేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేపట్టగా రెండు బ్యాగులు కనిపించగా అందులో సుమారు 8 కేజీల ఎండు గంజాయి పట్టుబడింది. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు రామ్మూర్తి పేర్కొన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్ రెడ్డి, సిబ్బంది రజాలి, షేక్ రియాజ్, ముస్తఫా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

పర్ణశాలను పట్టించుకోండి..

- పర్యాటక కేంద్రంగా చేసేందుకు అవకాశాలు మెండు
- రాత్రి బసకు సౌకర్యాలు కల్పిస్తే ఆదరణ
- ఆధ్యాత్మిక కేంద్రంగా దేశవ్యాప్తంగా ఖ్యాతి


పర్ణశాల ఆలయం, గ్రామం వ్యూ

భద్రాచలం: గల గల పారే గోదావరి పరవళ్లు ఒక వైపు, రామాయణ ఇతివృత్తంతో ముడి పడి ఉండి కొలువుదీరిన సీతారాములు మరో వైపు.. దీంతో పర్ణశాల సుందర ప్రదేశంగా విరాజిల్లుతోంది. గోదావరిలో బోటింగ్ చేస్తూ సూర్యాస్తమయం, సూర్యోదయం అందాలతో పాటుగా పచ్చని అడవులు, గుట్టల దృశ్యాలను చూస్తూ గడిపేది పర్ణశాలలో మాత్రమే. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి అనుబంధంగా పర్ణశాల ఆలయం పనిచేస్తోంది. క్షేత్ర ప్రాముఖ్యతతో భద్రాచలం రామాలయాన్ని దర్శించుకున్న భక్తులు పర్ణశాల ఆలయాన్ని దర్శించటానికి ఆసక్తి చూపుతారు. వసతులు ఏర్పాటు చేయటానికి అవకాశాలు ఉన్న నేపథ్యంలో పర్ణశాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు, పలువురు కోరుతున్నారు.

వసతులు కల్పిస్తే..

భద్రాచలం నుంచి పర్ణశాల సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం దేవస్థానానికి అనుబంధంగా ఉన్న ఈ ఆలయానికి రామాయణ ఇతివృత్తం ముడిపడి ఉంది. దీంతో భద్రాచలం వచ్చిన భక్తులు ఈ ఆలయాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. అయితే పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఆలయం వద్ద అద్భుతమైన సుందర దృశ్యాలు ఉన్నాయి. ఏడాది మొత్తం గోదావరి పరుగులు తీస్తూ ఉంటుంది. బోటింగ్ చేసే అవకాశం ఉంది. దీంతో పాటు దారి పొడవునా పచ్చని అడవులు కనిపిస్తుంటాయి. దీని చుట్టు పక్కల గిరిజన గూడేలు, వారి సంస్కృతి సంప్రదాయాలు దర్శనమిస్తుంటాయి. అర్బన్, మెట్రో సిటీ ప్రజలు సేద తీరాలని కోరుకునే సహజసిద్ధమైన వాతావరణం ఉన్న పర్ణశాల పర్యాటక కేంద్రంగా విరాజిల్లేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి,

అరకొర వసతులే..

పర్యాటకులు, భక్తులు అధికంగా వచ్చే పర్ణశాలలో మాత్రం ఎక్కువ సమయం గడిపేందుకు సౌకర్యాలను ప్రభుత్వం కల్పించలేదు. పర్ణశాల వచ్చిన భక్తులు కేవలం ఆలయ దర్శనం, అనంతరం సీతమ్మ నార చీర ప్రాంతాల దర్శనం అనంతరం కొద్ది సేపు బోటింగ్ చేయవచ్చు. అంటే ఒక పూట మాత్రమే ఇక్కడ కాలక్షేపం చేసే అవకాశం ఉంది. ఇప్పటికీ భక్తులు ఇక్కడ బస చేసేందుకు వసతి గృహాలు గానీ, ప్రైవేట్ లాడ్జీలు కానీ లేవు. హోటళ్లు సైతం సరిపడా లేవు. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకంలో భాగంగా డార్మెటరీ, ఇతర వసతులతో ఓ భవన నిర్మాణం చేపట్టింది. అది పూర్తయితే కొద్దిపాటి వసతి సౌకర్యం సమకూరుతుంది. కానీ, పర్యాటక కేంద్రంగా పూర్తిస్థాయిలో పర్ణశాలను అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

నిధులు కేటాయిస్తే అభివృద్ధి..

ప్రస్తుతం ప్రసాద్ పథకం కింద భద్రాచలం, పర్ణశాలలో డార్మెటరీ హాళ్లు, ఇతర వసతులతో కూడిన భవనాల నిర్మాణం జరుగుతోంది. పర్ణశాల వద్ద పనులు వేగంగా నడుస్తున్నాయి. అయితే ఆలయ ప్రాంగణంలో తొలుత రూ.7 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ఆదేశించటంతో ఆ పనులు ఆగిపోయాయి. అయితే, ఆ రూ.7 కోట్ల నిధుల్లో రూ.4 కోట్లను పర్ణశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని టూరిజం శాఖ ఇంజనీరింగ్ అధికారులు భావిస్తున్నారు. దీనికి సంబంధించిన ప్రణాళికను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. ఈ నిధులు విడుదలైతే పర్ణశాల అభివృద్ధి చెందుతుందని పలువురు చెబుతున్నారు.

కలెక్టర్ కృషి..


పర్ణశాలలో పంచవటి కుటీరం

జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ దృష్టిసారించారు. పలుచోట్ల పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి పరుస్తున్నారు. భద్రాచలం గోదావరి ఒడ్డున, దుమ్ముగూడెం మండలంలోని బొజ్జిగుప్ప ప్రాంతాలను అనుసంధానం చేస్తూ 'ఏరు ఉత్సవం' పేరిట ఓ ప్రత్యేక పర్యాటక ప్యాకేజీని సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటితో పాటు పర్యాటక కేంద్రంగా ఉండేందుకు అనువైన పర్ణశాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. రాత్రి వేళలో బస చేసేందుకు గోదావరి ఒడ్డున, ఇసుక తిన్నెల్లో అవకాశం ఉంది. టెంట్లు ఏర్పాటు చేసి వారికి తగిన వసతులను కల్పిస్తే సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులు ఇక్కడే అధిక సమయం గడిపే అవకాశం ఉంది.

ఇచ్చిన హామీలు నెరవేర్చండి..


మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి

కూసుమంచి: ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ సుల్తాన్ యాదగిరిరావు డిమాండ్ చేశారు. ఆదివారం కూసుమంచిలోని ఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన తొలి, మలి దశ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యమకారుల త్యాగాలు, బలిదానాల పునాదులపై తెలంగాణ ఏర్పడితే నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను పక్కనపెట్టి ఉద్యమ ద్రోహులను అందలం ఎక్కించిందన్నారు. అనంతరం ఉద్యమకారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు పలికగా ఎన్నికల సమయంలో పెన్షన్, ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి 15 నెలలు దాటినా అమలు చేయలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ మాదిరి కాంగ్రెస్ అప్రజాస్వామ్య విధానాలను విడనాడాలని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడాలని హితవుపలికారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రఫుల్ రాంరెడ్డి, బత్తుల సోమయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాధవీరెడ్డి, నాయకులు అన్వర్, పటేల్, తుల్జారెడ్డి, రాజేంద్రప్రసాద్, చంద్రన్న, ప్రసాద్, డోలక్ రాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పతకం


గోల్డ్ మెడల్ అందుకున్న విద్యార్థులు

గుండాల: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులు గోల్డ్ మెడల్ అందుకున్నారు. మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన రిషిత, మహమ్మద్ ముబీన స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కాంపిటీషన్‌లో వీరు ప్రతిభ కనబరిచారు. దీంతో వారిద్దరికీ గోల్డ్ మెడల్ అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

అలరించిన 'జనరల్ బోగీలు'


జనరల్ బోగీలు నాటికలో సన్నివేశం


ఖమ్మంగాంధీచౌక్: నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో 'జనరల్ బోగీలు' నాటికను ప్రదర్శించారు. జనరల్ బోగీల్లో సామాన్యుల ప్రయాణం, ఇబ్బందులపై నాటికను రూపొందించారు. ఈ నాటికను పీటీ మాధవ్ రచించగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. నాటికను కొలకలూరు శ్రీసాయి ఆర్ట్స్ సంస్థ కళాకారులు ప్రదర్శించారు. సావిత్రమ్మగా సురభి ప్రభావతి, ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎం.మధు, హెడ్‌కానిస్టేబుల్‌గా కె.నాగేశ్వరరావు, సీఐగా ఓపరాజు విజయ్, లాయర్‌గా పి.వినయ్ నటించారు. నాటికతో పాటు రాయల్ డాన్స్ అకాడమీ కూచిపూడి నృత్యాలయం, రుద్ర నాట్యాలయం విద్యార్థులు జానపద నృత్యాలు, భరతనాట్యం ప్రదర్శించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ మహ్మద్ అజీజ్, డాక్టర్ కావ్య చంద, ముకుంద ట్రస్ట్ చైర్‌పర్సన్ చెరుకూరి రాజి, కాళ్ల పాపారావు, యలమూడి రవీంద్ర మాట్లాడారు. అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ (ఆర్క్స్) అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఎ.సుబ్రహ్మణ్యకుమార్, కె.దేవేంద్ర, ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షులు డాక్టర్ నాగబత్తిని రవికుమార్, ప్రజానాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం, కొండల్‌రావు, కృష్ణ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్య


ఆదినారాయణ (ఫైల్)

చుంచుపల్లి: మండలంలోని పెనగడప గ్రామ పంచాయతీకి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ బిజ్జా ఆదినారాయణ (50) పురుగులమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఆదినారాయణ గతేడాది నవంబర్‌లో ఆయన భార్య గుండెపోటుతో మృతి చెందగా అప్పటినుంచి మనోవేదనకు గురవుతున్నాడు. వారం రోజుల కిందట గడ్డి మందు సేవించారు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా ఆదివారం మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


పూర్తిగా కాలిపోయిన ఇల్లు

మణుగూరుటౌన్: మండలంలోని సాంబాయిగూడెంలో ప్రమాదవశాత్తూ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. వాసంపల్లి లక్ష్మికి చెందిన ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. పెంకుటిల్లు పూర్తిగా కాలిపోగా ఇంట్లోని బంగారు నగలు, డబ్బు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. బీటీపీఎస్‌కు చెందిన రెండు ఫైరింజన్లు, మణుగూరు ఫైరింజన్ సిబ్బంది సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సర్వస్వం కోల్పోయిన లక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపించింది.

గ్రానైట్ కార్మికుడు మృతి

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు గ్రానైట్ కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని గువ్వలగూడెంలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన రాకేశ్ జానా (24)పై ప్రమాదవశాత్తు బండ రాయి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. నిర్వాహకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందాడని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మూడు ప్రమాదాలు.. ఐదుగురికి గాయాలు

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఖమ్మానికి చెందిన వేణుకుమార్, సంధ్య దంపతులు, తమ చిన్నారితో కలిసి బైక్‌పై కోదాడ వైపు వస్తున్నారు. ఆచార్లగూడెం వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 ద్వారా ఖమ్మం తరలించారు. నేలకొండపల్లికి చెందిన షేక్ మదర్సావలీ కోదాడ వైపు నుంచి నేలకొండపల్లికి వస్తుండగా పెట్రోల్ బంక్ సమీపంలో డివైడర్ తగిలి తీవ్రంగా గాయపడగా ఖమ్మం తరలించారు. చెరువుమాధారం క్రాస్‌రోడ్ వద్ద బైక్ పైనుంచి పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని కోదాడ తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి...

పెనుబల్లి: మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. కల్లూరు మండలం ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన బీరవల్లి వీరయ్య, బీరవల్లి వెంకటి, బీరవల్లి మోహన్‌రావు చెన్నూరుకు చెందిన ఆటోలో కొత్తగూడెం బయలుదేరారు. ఆటో మండలంలోని టేకులపల్లి వద్దకు చేరుకోగా జంగారెడ్డిగూడెం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఆటో డ్రైవర్‌తోపాటు ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీఎంబంజర్ ఏఎస్‌ఐ సత్యనారాయణ క్షతగాత్రులను 108 వాహనంలో పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను ఢీ కొట్టిన ఆటో

ఇద్దరి పరిస్థితి విషమం

పాల్వంచ: మోటార్ సైకిల్‌ను ఆటో ఢీ కొట్టడంతో ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఆదివారం రాత్రి 11.15 గంటల సమయంలో మోటార్ సైకిల్‌ను ఆటో ఢీ కొట్టడంతో మోటార్ సైకిల్‌పై ఉన్న ముగ్గురు కిందపడ్డారు. ఇందులో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక అదనపు ఎస్‌ఐ రామ్మూర్తి కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురం శివారులోని వాగు నుంచి అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి, ట్రాక్టర్ యజమాని గోలి చంద్రశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

చండ్రుగొండ: మండలంలోని సీతాయిగూడెం వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా, ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఏఎస్‌ఐ పాపయ్య ఆదివారం రాత్రి తెలిపారు. ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని యజమాని దొడ్డపనేని శేషగిరిరావుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

కొణిజర్ల: ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్రవాహనం చోరీకి గురైన ఘటన మండలంలోని శాంతినగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ జి.సూరజ్ కథనం ప్రకారం.. వైరా మున్సిపాలిటీలోని శాంతినగర్‌కు చెందిన కట్ల నిఖిల్ రోజు వారీలాగానే తన ఇంటి ఎదుట పల్సర్ బైక్ తాళం వేసి, నిలిపిఉంచాడు. ఆదివారం ఉదయం చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ సూరజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడల్లో గెలుపు, ఓటమి ఉంటాయి

- ఉద్యోగులకు ఆటలు ఉపశమనం కలిగిస్తాయి..
- కోలిండియా అథ్లెటిక్స్ మీట్‌లో డైరెక్టర్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న డైరెక్టర్ (ఆపరేషన్స్) సూర్యనారాయణ

సింగరేణి(కొత్తగూడెం): క్రీడల్లో గెలుపుతోపాటు ఓటమి కూడా ఉంటుందని, వాటిని సమానంగా స్వీకరించాలని, ఆటల్లోని మెళకువలను తెలుసుకొని ముందుకు సాగాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన కోలిండియా స్థాయి అథ్లెటిక్స్ మీట్ (మహిళలు, పురుషులు)ఆదివారం ముగియగా విజేతలకు ఆయన బహుమతుల ప్రదానం చేసి మాట్లాడారు. 38 విభాగాల్లో క్రీడాపోటీలు జరగగా మహిళలు, పురుషులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. 21 విభాగాల్లో పురుషులు బంగారు పతకాలు, 17 విభాగాల్లో మహిళలు బంగారు పతకాలు సాధించారన్నారు. సింగరేణి సంస్థ 5 బంగారు, 10 రజతం, 3 కాంస్య పతకాలు సాధించిందని పేర్కొన్నారు. 100 మీటర్ల పరుగుపందెంలో విజయశాంతి, మేకల ఉదయశ్రీ, కడలి మాన్విత, సుష్మ కాంస్యం, జావెలిన్‌త్రో విభాగంలో కడలి మాన్విత బంగారు పతకం, లాంగ్‌జంప్‌లో ఈ.సుష్మారాణి వెండి పతకం, షాట్‌పుట్‌లో కడలి మాన్విత బంగారు పతకం గెలుచుకగా.. పురుషుల విభాగంలో 1500 మీటర్ల పరుగుపందెంలో ఎస్.క్రాంతికిరణ్ వెండి పతకం, జావెలిన్‌త్రో విభాగంలో కె.రమేశ్ కాంస్య పతకం, లాంగ్‌జంప్‌లో సిల్వ ఆదిత్య వెండి పతకం సాధించారు. వీరంతా సింగరేణి ఉద్యోగులు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీస్తున్నాం


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీడీ మణెమ్మ

భద్రాచలం : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను, నైపుణ్యాలను వెలికి తీసి వారి భవిష్యత్ ఉన్నత స్థాయికి చేరేందుకే ప్రతిభ ప్రోత్సాహక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ డీడీ మణెమ్మ అన్నారు. భద్రాచలం ఏజీహెచ్‌ఎస్ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆదివారం ఆమె సందర్శించారు. ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా నిర్భయంగా పరీక్ష రాసి అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి తర్వాత రాసే కాంపిటేటివ్ పరీక్షలు, జేఈఈ, నీట్, ఎంసెట్ వంటివి రాసేందుకు ఈ ప్రతిభ పరీక్షలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ప్రతిభ ప్రోత్సాహక పరీక్ష రాసే విద్యార్థులకు పాధ్యాయులు, ఇన్విజిలేటర్లు ఎలాంటి సహకారం అందించొద్దని, సహాయ సహకారాలు అందించవద్దని, వారి సొంత ప్రతిభతోనే రాసేలా చూడాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పరీక్ష కేంద్రం స్క్వాడ్, ఏటీడీఓ చంద్రమోహన్, గురుకులం ఆర్సీఓ నాగార్జున రావు, పాఠశాల హెచ్‌ఎం సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

బాలికల కబడ్డీ చాంపియన్‌గా 'భద్రాద్రి'


చాంపియన్ ట్రోఫీ అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యాన నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న 34వ సబ్ జూనియర్ అంతర్రాష్ట్ర బాలబాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో బాలికల విభాగంలో భద్రాద్రి జిల్లా జట్టు విజయం సాధించగా రంగారెడ్డి జిల్లా రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా విజేత భద్రాద్రి జట్టుతో పాటు రన్నరప్‌గా నిలిచిన రంగారెడ్డి జట్టుకు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అలాగే, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరశురాం నాయక్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల డంప్ లభ్యం


పోలీసులు స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల డంప్

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా చింతగుఫా పోలీస్‌స్టేషన్, మెట్టగూడా క్యాంప్ పరిధి కామెట్టాకొండ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు దాచిన డంప్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఆదివారం మావోయిస్టుల సంచారం ఉందనే సమాచారంతో మెట్టాగూడా క్యాంప్ నుంచి 203 బెటాలియన్ కోబ్రా, 131 బెటాలియన్ సీఆర్పీఎఫ్, జిల్లా పోలీసు బలగాలు కామెట్టాకొండ అటవీ ప్రాంతంలోకి గాలింపు కోసం వెళ్లాయి. పెద్ద రాళ్ల మధ్యన మావోయిస్టులు దాచి ఉంచిన డంప్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

కారేపల్లి: మండలంలోని రేలకాయలపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు కారేపల్లి ఎస్‌ఐ ఎస్.రాజారాం దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3 సెల్‌ఫోన్లు, రూ.4,700 నగదుతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.